RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ


కరీంనగర్ బుధవారం 14.01.2026 సంపుటి : 03 సంచిక : 44 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Wednesday 14.01.2026 Volume: 03 Issue 44 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## మహారాష్ట్రలో మేకల బ్యాంక్!

నగదుకు బదులు రుణంగా మేక అందజేత




2

## దావోస్ వేదికగా

# తెలంగాణ రైజింగ్

## ప్రపంచ కంపెనీల సీఈవోలతో భేటీకానున్న సీఎం

**దావోస్ నుంచి అమెరికాకు ముఖ్యమంత్రి**

**అక్కడ పలు సంస్థల ప్రతినిధులతో భేటీ**

**ఫిబ్రవరి 1న తిరిగి హైదరాబాద్‌కు సీఎం**

**18న ఖమ్మం జిల్లా పాలేరులో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం.. అదే రోజున సీపీఐ వందేళ్ల సభకు హాజరు అక్కడి నుంచి మేడారంలో మంత్రివర్గ సమావేశం.. మర్నాడు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని దావోస్‌కు**



**హైదరాబాద్, జనవరి 13 :** ప్రపంచ ఆర్థిక వేదికగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నమూనాను విశ్వవ్యాప్తం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సన్నద్ధమైంది. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే సదస్సులో భాగంగా తెలంగాణ రైజింగ్ పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ, తెలంగాణ ఏఐ హబ్‌ను జనవరి 20న ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (సీఈవోలు), అంతర్జాతీయ ప్రతినిధులకు తెలంగాణ రైజింగ్ దార్శనికతను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వివరించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఈ నెల 19న దావోస్‌కువెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి నుంచి అమెరికా వెళ్లనున్నారు. అమెరికా పర్యటనను ముగించుకుని ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు సీఎం రేవంత్ చేరుకుంటారు. పెట్టుబడుల కోసం ఈనెల 19న హైదరాబాద్‌ను వీడనున్న సీఎం.. ఏకబిగిన 13 రోజుల్లో రెండు దేశాలను పర్యటించి రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించనున్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, 17న జడ్చర్లలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయా జిల్లాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## కుంభమేళా కంటే ఘనంగా మేడారం జాతర



**జాతీయస్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకువస్తాం**

**జాతరకు 3 కోట్ల మంది హాజరయ్యే అవకాశం**

**రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు**

**సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ**

**భక్తులకు ఇబ్బంది కలగకూడదన్నది ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క**

3

## ప్రతి కుక్కకాటుకు

# భారీ జరిమానా



## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం హెచ్చరిక



**శునక ప్రేమికులనూ బాధ్యుల్ని చేస్తామని వెల్లడి**

**అంతగా ప్రేమిస్తే వాటిని మీ ఇంట్లో పెట్టుకోండి**

2

## గ్రామ పంచాయతీలకు

# 277 కోట్లు విడుదల



**హైదరాబాద్, జనవరి 13 :** ప్రజాభవన్‌లో మంగళవారం ఆర్థికశాఖ అధికారులతో భట్టి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన భట్టి రూ.277 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

# ప్రతి కుక్క కాటుకూ భారీ జరిమానా

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక**

**శునక ప్రేమికులనూ బాధ్యుల్ని చేస్తామని వెల్లడి**

**అంతగా ప్రేమిస్తే వాటిని మీ ఇంట్లో పెట్టుకోండి**

**న్యూఢిల్లీ, జనవరి 13:** వీధి కుక్కల కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. ఏబీసీ నిబంధనలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన పక్షంలో ప్రభుత్వ అధికారులపై భారీ జరిమానాలు విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ప్రతి కుక్క కాటుకూ, దాని వల్ల సంభవించే ప్రతి మరణానికి భారీ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను న్యాయస్థానం హెచ్చరించింది.కుక్క కుటు ప్రభావం జీవితాంతం ఉంటుందని, ఈ దాడులకు వీధి కుక్కల పోషకులను బాధ్యుల్ని చేయాలని కూడా కోర్టు పేర్కొంది. వీధి కుక్కల కేసుపై విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం కుక్క కాట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బాధ్యుల్ని చేస్తామని ప్రకటించింది. ఈ కేసు విచారణ సుదీర్ఘంగా కొన సాగుతున్నదని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. 1950వ దశకం నుంచి పార్లమెంట్ పరిశీలనలో ఈ అంశం ఉన్నట్లు ప్రభుత్వమే చెబుతున్నదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం వల్ల ఈ సమస్య 1000 రెట్లు పెరిగిందని ధర్మాసనం తెలిపింది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని న్యాయస్థానం ఆక్షేపించింది. కుక్క కాటు వల్ల ప్రాణాలు కోల్పోయిన ప్రతి పురుషుడు, మహిళకు ప్రభుత్వాన్ని బాధ్యురాలిని చేసి భారీ నష్టపరిహారం విధిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న జంతుప్రేమికులపై కూడా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మిమ్మల్ని కూడా బాధ్యుల్ని చేస్తాం. అంతగా ప్రేమిస్తే వాటిని మీ ఇంట్లో పెట్టుకోండి. వాటిని ఎందుకు బయట వదలి ప్రజలను కరవడానికి, వెంటపడడానికి అనుమతిస్తున్నారు? కుక్క కాటు ప్రభావం జీవితాంతం వెంటాడుతుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.గత వారం మూడు సార్లు సుదీర్ఘ విచారణ తర్వాత మళ్లీ ఈ వారం ఈ వివాదాస్పద అంశం విచారణకు వచ్చింది. అన్ని వీధి కుక్కలను తరలించాలని తాము చెప్పడం లేదని, నిబంధనలను సక్రమంగా అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని గతవారం ధర్మాసనం స్పష్టం చేసింది. చట్ట నిబంధనలు సక్రమంగా అమలు జరిగేందుకు అనుమతించాలని మాత్రమే కోరుతున్నామని నేటి విచారణలో ఇరుపక్షాల న్యాయవాదులకు ధర్మాసనం స్పష్టం చేసింది.

**వీధి బాలలపై ఆ జాలి ఏదీ?**

విచారణ సందర్భంగా గుజరాత్ హైకోర్టులో కుక్కకాటుకు గురైన ఓ న్యాయవాది కేసును కోర్టు ప్రస్తావించింది. గుజరాత్‌లో ఓ న్యాయవాదిని కుక్క కరిచిన తర్వాత వీధి కుక్కలను పట్టుకోవడానికి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది అక్కడకు వెళ్లారు. అయితే ఇదే శునక ప్రేమికులమని చెప్పుకునే న్యాయవాదులే మున్సిపల్ సిబ్బందిని తరిమికొట్టారని ధర్మాసనం తెలిపింది. జంతు సంరక్షణశాలలు, జంతు హక్కుల రక్షణ సంఘాలు, జంతు ప్రేమికుల తరపున న్యాయవాదులు వాదనలు



వినిపిస్తూ వీధి కుక్కలకు శాశ్వత ఆశ్రయం కల్పించేందుకు అవసరమైన నిధులు మున్సిపల్ అధికారుల వద్ద లేవని తెలిపారు.అన్ని జీవులను దయతో, ప్రేమతో చూడాలని, వీధి కుక్కలను తొలగించినంత మాత్రాన ఈ బెడద శాశ్వతంగా తీరిపోదని వారు చెప్పారు. వీధి కుక్కలను దత్తత తీసుకునే వారికి రాయితీలు కల్పిస్తూ ఓ జాతీయ విధానాన్ని రూపొందించాలని ఓ న్యాయవాది సూచించారు. దీనిపై జస్టిస్ సందీప్ మెహతా మండిపడుతూ వీధిబాలలను దత్తత తీసుకునే విషయంలో ఎందుకు ఆ జాలి, కరుణ రావడం లేదని ప్రశ్నించారు. కేసు విచారణ జనవరి 20కి వాయిదాపడింది.

# కవితకు నో ఎంట్రీ

**కాంగ్రెస్‌లోకి కవిత ఎంట్రీపై పీసీసీ చీఫ్ క్లారిటీ**

**బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదు**

**కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు**

**ఏప్రిల్‌లో కార్పొరేషన్ చైర్మన్లను భర్తీ**

**సర్వేల ఆధారంగా టికెట్లు**

**గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తాం**

**హైదరాబాద్, జనవరి 13:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్పున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చి చెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ చైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ



వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీసీసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చి చెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు.




## మహారాష్ట్రలో మేకల బ్యాంక్!

**నగదుకు బదులు రుణంగా మేక అందజేత**

**ముంబై:** మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఒక బ్యాంక్ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ బ్యాంక్‌కు రుణం కోసం వెళ్తే నగదుకు బదులుగా ఒక మేకను రుణంగా ఇస్తారు. ఈ గోట్ బ్యాంక్ ఇప్పటివరకు ఇలా 300 మందికి మేకలను రుణంగా ఇచ్చి వారికి ఉపాధి కల్పించింది. ఇందులో వితంతువులు, భూమిలేని మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఈ రుణంతో వారు స్వయం ఉపాధి పొందుతున్నారు. జల్గావ్ లోని ఒక ఫౌండేషన్ నడుపుతున్న ఈ బ్యాంక్ దగ్గరకు రుణం కోసం వెళ్లే మహిళలకు తొలుత వాటిని ఎలా పెంచాలో శిక్షణ ఇస్తారు.తర్వాత వారికి ఒక మేకను రుణంగా ఇస్తారు. అయితే ఇక్కడ బ్యాంక్ రుణం ఎలా తీరుస్తారు అన్న సందేహం వస్తుంది ఎవరికైనా, మేకను రుణంగా తీసుకున్నారు కాబట్టి వారు తిరిగి మేకనే రుణ బకాయిగా బ్యాంక్‌కు చెల్లించాలి. అది ఎలాగంటే రుణం తీసుకున్న మహిళ తన మేకకు పుట్టిన మేక పిల్లను బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలి. ఇలా 40 నెలల రుణ ఒప్పంద కాలంలో ఆ మహిళ నాలుగు ఆరోగ్యకరమైన మేక పిల్లలను బ్యాంక్‌కు ఇస్తుంది. అలా ఇచ్చిన మేక పిల్లలు పెద్దవైన తర్వాత బ్యాంక్ వారు దానిని ఇంకొకరికి రుణంగా ఇస్తారు. ఈ పథకం కారణంగా ప్రతి మహిళ ఏడాదికి రూ.30 వేలు సంపాదిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

# కుంభమేళా కంటే ఘనంగా మేడారం జాతర నిర్వహణ




**జాతీయస్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకువస్తాం**

**జాతరకు 3 కోట్ల మంది హాజరయ్యే అవకాశం**

**రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు**

**సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ**

**భక్తులకు ఇబ్బంది కలగకూడదన్నది ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క**

**జనోదయ, ములుగు, జనవరి 13:**

జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి దాదాపు మూడు కోట్లమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయ (సీతక్క)లు అన్నారు. మేడారం జాతరపై మంగళవారం డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సవ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్షణ్ మాట్లాడుతూ... గత మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి జాతరకు దాదాపు గతంలో కంటే 150 కోట్ల నిధులను అదనంగా మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు.

**కుంభమేళాను మించి జాతర నిర్వహణ...**

సమ్మక్క–సారలక్క జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి లక్ష్మణ్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదనీ, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ...**

భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి తెలిపారు.

**వసతులలో విఐపి, సామాన్యులు అనే తేడా ఉండొద్దు...**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు–సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ... జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్–అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు.ఈ సందర్భంగా మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను ఆవిష్కరించారు.

## బుగ్గ అడవుల్లో జోరుగా గుప్త నిధుల తవ్వకాలు?

**దృష్టి సారించాలంటున్న స్థానికులు**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 13:**

బెల్లంపల్లి మండలంలోని పెద్ద బుగ్గ అటవీ ప్రాంతంలో గత కొంతకాలంగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. తాజాగా బుగ్గ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. బుగ్గ అటవీ ప్రాంతంలో పలుచోట్ల తవ్విన ఆనవాళ్లు కనిపిస్తుండడంతో అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది. బుగ్గ దేవాలయం పరిసరాల్లోని అడవుల్లో గుట్టుగా గుప్త నిధుల వేట సాగుతున్నట్లు స్పష్టమవుతుంది. కాకతీయుల చరిత్రకు ఈ ప్రాంతం నెలవుగా గుర్తింపు పొందింది. ప్రాచీన ప్రదేశంగా భావిస్తుండడంతో గుప్త నిధుల అన్వేషణ కోసం ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. గుర్తుతెలియని కొన్ని ముఠాలు రాత్రివేళ బుగ్గ అటవీ ప్రాంతాల్లో గుప్త నిధుల వేట సాగిస్తున్నట్లు స్థానికులు చర్చించుకోవడం ఈ ప్రాంతంలో కలకలం రేపుతోంది. బుగ్గ గూడెం ప్రాజెక్టు పరిసరాల్లో దేవుడి గద్దెను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి తవ్వకాలకు పాల్పడే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు స్థానికుల నుండి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.








## రేచపల్లిలో విద్యుత్ శాఖ ప్రజాబాట

**జనోదయ, జగిత్యాల, జనవరి 13**

సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సారంగాపూర్ ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ వేణు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పరిశీలించారు. అలాగే గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు విద్యుత్ వినియోగంలో లోడును తగ్గించేందుకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాస మహేష్, ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, లైన్మెన్ రవీంద్రబాబు, అసిస్టెంట్ లైన్మెన్ శేఖర్, అన్‌మ్యాన్ ప్రవీణ్, వెంకటేష్, లక్ష్మారెడ్డి, మహేష్‌తో పాటు గ్రామ రైతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి వేళ
# గాలిపటాలు- విద్యుత్ ప్రమాదాలపై జరభద్రం

**ప్రజలకు విద్యుత్ శాఖ హెచ్చరిక**

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా గాలిపటాల సందడి మొదలైంది. చిన్నా పెద్దా తేడా లేకుండా మేడలపై, ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకుంటున్నారు. అయితే ఈ ఉత్సాహంలో విద్యుత్ భద్రతను విస్మరిస్తే తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ప్రత్యేకంగా పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో గాలిపటాలు ఎగురవేయడం వల్ల విద్యుదాఘాత ప్రమాదాలు పెరుగుతున్నాయని అధికారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా సంక్రాంతి సమయంలో గాలిపటాలు విద్యుత్ తీగలకు చిక్కి, షార్ట్ సర్క్యూట్‌లు జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, కొందరు గాయపడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. నైలాన్ దారం, చైనా మంజా వంటివి విద్యుత్‌ను సులభంగా ప్రసరింపజేస్తాయని, ఇవి విద్యుత్ తీగలకు తగిలినప్పుడు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అంతేకాదు, ఈ దారాల వల్ల పక్షులు, జంతువులు, ద్విచక్ర వాహనదారులు కూడా తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు. అందుకే పత్తి దారంతో చేసిన సాధారణ మంజానే ఉపయోగించాలని సూచించారు.

**విద్యుత్ శాఖ విడుదల చేసిన సూచనల ప్రకారం---**

విద్యుత్ లైన్లకు దూరంగా ఉన్న ఖాళీ మైదానాల్లో మాత్రమే గాలిపటాలు ఎగురవేయాలి.

మేడలపై లేదా బాల్కనీలపై నిలబడి గాలిపటాలు ఎగురవేయడం నివారించాలి.

గాలిపటం విద్యుత్ తీగలకు చిక్కితే, దాన్ని తీసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించకూడదు.

తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తున్నపుడు పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి."పండుగ ఆనందం క్షణికమైనది, ప్రాణాల విలువ శాశ్వతమైనది" అని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. గాలిపటాలు ఎగురవేస్తూ భద్రతా నియమాలు పాటిస్తేనే సంక్రాంతి పండుగ నిజమైన సంతోషాన్ని ఇస్తుందని వారు విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని అధికారులు కోరుతున్నారు.






## క్రీడలు స్నేహభావాన్ని
# పెంపొందిస్తాయి
## సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్



**జనోదయ, భీమారం, జనవరి 13**

భీమారం మండలంలోని ఒడ్యాడ్ గ్రామంలో కబడ్డీ ఆటగాళ్లకు డైమండ్ హెల్పింగ్ హాండ్స్ అధినేత సూర రాజశేఖర్ ఆధ్వర్యంలో టీ-షర్ట్ పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ క్రీడాకారులకు అందజేశారు. క్రీడలతో యువకుల్లో స్నేహభావం పెంపొందుతుందని యువత క్రీడా రంగంలో రాణించాలని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే సీఎం కప్ ఆటలపోటీల్లో మన గ్రామానికి విజయాన్ని తీసుకురావాలని ఆ దిశగా సాధన చేయాలని యువకులను కోరారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. యువకులను క్రీడలవైపు ప్రోత్సహిస్తున్న సూర రాజశేఖర్ ను అభినందించారు. ఇలాంటి సేవలను డైమండ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మన గ్రామంలో మరిన్ని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు దండికెపు మోహన్, ఆవ సాగర్, కబడ్డీ సీనియర్ స్టేట్ ప్లేయర్ మ్యాకల మహేష్, సంతోష్, తిరుపతి, గణేష్, గంగారెడ్డి మరియు యువకులు, క్రీడాకారులు సాయి, చందు, వంశీ, శివనంద్, మణి కుమార్, రవి, ప్రదీప్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి మున్సిపల్
# ఎన్నికల నిర్వహణలో కార్మిక మంత్రి వివేక్ విఫలం



**బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జె రవీందర్**

**జనోదయ, మందమర్రి జనవరి 13:**

ఏజెన్సీ వివాదం కారణంగా నిలిచిపోయిన మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యాడని బిఆర్ఎస్ పార్టీని అధ్యక్షులు జె రవీందర్ విమర్శించారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ఏజెన్సీ ప్రాంతాన్ని మున్సి పాలిటీగా మారుస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ది పొందినప్పటికీ మున్సిపాలిటీ ఎన్నికలు జరిపించక పోవడం సిగ్గుచేటు అని మండి పడ్డారు. పట్టణంలో అభివృద్ధి పనులు చేయడంలో మంత్రి పూర్తిగా విఫలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గెలిచిన వెంటనే శంకుస్థాపన చేసిన సులబ్ కాంప్లెక్స్ ఇప్పటి వరకు కూడా పూర్తి చేయకపోవడం మంత్రి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంద న్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చెన్నూరు మాజీ బాల్క సుమన్ మున్సిపాలిటి అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు తీసుక వచ్చి అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మేలు చేశాడని ఆయన గుర్తు చేశారు. సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్, కేసిఆర్ పార్క్, హిందూ స్మశాన వాటికలు, క్రిస్టియన్, ముస్లిం గ్రేవ్ యార్డులు, సెంట్రల్ లైటింగ్ అంబేద్కర్ స్కిల్ సెంటర్, దోభి ఘాట్ వంటి పనులు పూర్తి చేయక వాటికి కేటాయించిన నిధులతో రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు చేపడుతూ మంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ బండారు సూరి బాబు, టిబిజికెఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్, పార్టీ సీనియర్ నాయకులు, యూత్ విద్యార్థి సోషల్ మీడియా వార్డు అధ్యక్షులు మద్ది శంకర్, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్, మేడిపల్లి మల్లేష్, నలువాల సమ్మయ్య, భూపెల్లి కనకయ్య, పల్లె నర్సింగ్, వీరరెడ్డి, బట్టు రాజ్ కుమార్, తోట సురేందర్, ముస్తఫా, బెల్లం అశోక్, రవి నాయక్, మొగురం శ్రీనులు పాల్గొన్నారు.

### సమ్మక్క జాతర దుకాణాలకు

# ఈనెల 17న వేలం పాట



**జనోదయ, మందమర్రి జనవరి 13:**

ఏరియా లోని ఆర్కే 1ఎ పాలవాగు వద్ద ఈ నెల 28 నుండి నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరలో ఏర్పాటు చేయనున్న వివిధ దుకాణాలకు ఈ నెల 17 న వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందని సింగరేణి యాజమాన్యం తెలిపింది. ఈ నెల 28 నుండి 31వరకు నిర్వహించనున్న జాతరలో కొబ్బరికాయలు, వెహికిల్ పార్కింగ్, బెల్లం తూకాలు, కళ్యాణ కట్ట (తలనీలాలు) ఇతర దుకాణాలు ఏర్పాటు చేయదలచిన ఉత్సాహవంతు లైన వ్యాపారస్తులు, ప్రజలు ఈ నెల 17 న ఉదయం 10 గం,, లకు పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం ఆవరణ లో నిర్వహించే వేలంపాటలో పాల్గొని దుకాణాలను సొంతం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. ఔత్సాహికులు దరావత్ రూ 1,000/- చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించింది. ధరవత్ ( డిపాజిట్ ) పైకం తిరిగి చెల్లించబడదని సింగరేణి యజమాన్యం స్పష్టం చేసింది.

# అక్రమ టెండర్ల నిర్వహణపై వ్యాపారుల ఆగ్రహం

**జనోదయ, జగిత్యాల, జనవరి, 13**

జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధి చెందిన దుబ్బరాజన్న మహాశివ రాత్రి జాతర వచ్చే నెల ఫిబ్రవరిలో జరుగుతున్నందు వల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ చేయడానికి టెండర్లు వేస్తారు. కానీ కోనాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండానే చట్టాలకు విరుద్ధంగా తేది: 12-01- 2026 సోమవారం నాడు వాహనాలు పార్కింగ్ టెండర్ నిర్వహించినట్లు తెలిపారు. కోనాపూర్ సైకిల్ పార్కింగ్ టెండర్లలో గోల్ మాల్ జరిగిందని, ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండానే చట్టాలకు విరుద్ధంగా టెండర్లు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, టెండర్లు రద్దు చెయ్యాలని ప్రజల విన్నపం చేశారు.

### పదవీ విరమణ పొందిన

# కార్మికులకు సన్మానం

**-సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఓదయ్య -**



**జనోదయ, మందమర్రి జనవరి 13:**

సింగరేణిలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన కార్మికులకు సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఒడ్డేపల్లి ఓదయ్య ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన పదవి విరమణ కార్మికులను సింగరేణి యాజమాన్యం సన్మానించకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. సాటి కార్మికులుగా గుర్తించి వారిని గౌరవించాలనే ఆశయంతో వారిని సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికులు వాసాల శంకర్, నామని ముత్తయ్యలు పాల్గొన్నారు.

### రహదారి భద్రతా నియమాలతోనే

# సురక్షిత ప్రయాణం

### పట్టణ సీఐ శశిధర్ రెడ్డి



**జనోదయ మందమర్రి జనవరి 13:**

రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని పట్టణ సీఐ కే శశిధర్ రెడ్డి కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రారంభించిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం లో భాగంగా పాత బస్టాండ్ లక్ష్మీ భవాని కాలనీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13 నుండి 24 వరకు రోడ్డు భద్రత గురించి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ తరపున నిర్వహిస్తుదన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి చిన్న చిన్న పొరపాట్లు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం లక్ష్మీ భవాని కాలనీకి చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేక పోవడం వల్ల తలకు, దవడలకు తగిలే గాయాల తీవ్రతను కళ్ళకు కట్టినట్లు వివరించారు. వైద్యం కోసం తన వద్దకు వచ్చే వారిలో హెల్మెట్ లేక దవడలు విరిగిపోయి, ముఖం వికృతమై, ఆహారం కూడా తీసుకోలేక నరకయాతన పడేవారిని చూస్తుంటే బాధగా ఉంటుందన్నారు. ఆపరేషన్లు చేసినా పాత రూపు రావడం కష్టమని మీ ముఖాన్ని, మీ నవ్వును, మీ ప్రాణాన్ని కాపాడుకోవాలంటే హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, ఏఎస్ఐ మిలింద్ కుమార్, కాలనీ పెద్దలు దుర్గం ప్రభాకర్, కాసర్ల శ్రీనివాస్, ఆటో యూనియన్ అధ్యక్షుడు మొయ్య రాంబాబు, ఆటో డ్రైవర్లు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి


### ఎమ్మెల్యే గడ్డం వినోద్



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 13:**

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లైవ్ (రోడ్డు భద్రత అవగాహన సదస్సులో) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు రాష్ట్రంలో తీవ్రమైన సమస్యగా మారాయని, వాటిని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడప వద్దని సూచించారు. రోడ్డుపై నడిచేటప్పుడు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు నష్టపోతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలను గుర్తించి వారికి అండగా ఉంటామన్నారు. డిసిపి ఏ. భాస్కర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తాండూర్, బెల్లంపల్లి, బెల్లంపల్లి రూరల్ సిఐలు దేవయ్య, శ్రీనివాసరావు, హనూక్, మాదారం, కన్నెపల్లి, భీమిని ఎస్ఐలు సౌజన్య, భాస్కరరావు, విజయ్ కుమార్ లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఖరారు



ఎమ్మెల్యే వినోద్‌ను సన్మానిస్తున్న నూతన మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రత్నం లక్ష్మీ, నాయకులు రత్నం ప్రదీప్

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 13:**

బెల్లంపల్లి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం అధ్యక్షులుగా కాసిపేట మండలానికి చెందిన రత్నం లక్ష్మీ నియామకమైంది. పాలక వర్గం వైస్ చైర్మన్‌గా సంఘర్ష రవీందర్ రావు, సభ్యులుగా కమ్మని శ్రీనివాస్, గోలేటి సంధ్య, కమ్మరి భీమయ్య, టకిరే వొల్లెష్, పంజాల శ్రీనివాస్ గౌడ్, బట్టు శ్రీనివాస్, చిన్నోజు శంకరయ్య, ఊతూరి సత్తయ్య, మహమ్మద్ నిజాముద్దీన్ లతో పాటు బెల్లంపల్లి పిఏసిఎస్ స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్, బెల్లంపల్లి ఏ డి ఏ, బెల్లంపల్లి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్,( చైర్మన్)లను పాలక వర్గ సభ్యులుగా నియమిస్తూ ఏపీ సి సెక్రటరీ కె .సురేంద్ర మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి




**ఈనెల 21న ఛలో బస్ భవన్**

**వరంగల్ రీజియన్ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం**

**జనోదయ, హనుమకొండ**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోలలో వివిధ హోదాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రిటైర్ అయిన తర్వాత 2017 నుండి ఇప్పటివరకు (09 సం"ల కాలం) రిటైర్మెంట్ సెటిల్మెంట్లు సంస్థ ద్వారా రావలసినవి రాకపోవడం మూలంగా రకరకాల ఇబ్బందులు పడుతున్నందున వెంటనే చెల్లించాలని వరంగల్ రీజియన్ ఆర్టిసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ముఖ్యంగా 2017 అరియర్స్ , 2017 ఏప్రిల్ నుండి 2024 ఏప్రిల్ వరకు రావాల్సిన గ్రాట్యుటి, లీవ్ ఎన్కాష్మెంట్ డిఫరెన్స్, 2024 అక్టోబర్ నుండి 2025 డిసెంబర్ వరకు రావాల్సిన లీవ్ ఎన్కాష్మెంట్ డబ్బులు, సిపిఎస్ సెటిల్మెంట్లు, ఆగస్టు'2025 నుండి డిసెంబర్ 2025 వరకు రావలసిన గ్రాట్యుటీ లాంటి బకాయిలు చట్ట ప్రకారం చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీరక,అధిక వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ కొందరు అకాల మరణం చెందుతున్నారనీ, పిల్లల పెండ్లిలకు, చదువులకు, అనారోగ్య కారణాలవల్ల చేసిన అప్పులు తీరక మానసిక వేదన చెందుతూ కాలం వెళ్లబుచ్చుచున్నామని ప్రభుత్వానికి, యాజమాన్యానికి తెలిపారు.

**ఈనెల 21న చలో బస్ భవన్...**

ఈనెల 20 లోగా బకాయిలు చెల్లించని ఎడల 21 న బకాయిల సాధన కోసం బస్ భవన్ వద్ద బైటాయింపు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ప్రెస్ మీట్‌లో వరంగల్ రీజియన్ విశ్రాంత ఉద్యోగులు పట్టాభి లక్ష్మయ్య, పాసికంటి మనోహర్,అశోక్ రావు,వెంకటయ్య, ఎం.ఎస్.రావు, సదానందం, గూడెల్లి బిక్షపతి, విశ్వనాథం,సోమయ్య,పెద్ది రవీందర్, శివాజీ కోటగిరి,వీరన్న, యాదగిరి స్వామి, ఎల్లయ్య, హయగ్రీవ చారి,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 13:**




రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను కలెక్టర్ దీపక్ కుమార్‌తో కలిసి అందజేశారు. సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బెల్లంపల్లి నియోజకవర్గానికి రూ 30 లక్షల వరకు రాయితీ లభించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వివేకానంద విద్యాలయంలో మకర సంక్రాంతి వేడుకలు



**గంగాధర, జనోదయ జనవరి13 :**


గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో శనివారం ముందస్తు మకర సంక్రాంతి వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు.వేడుకల్లో భాగంగా భోగి మంటలు, రంగుల ముగ్గుల అలంకరణ, పిండి వంటకాలు (పొంగల్) తయారీ వంటి కార్యక్రమాలను విద్యార్థులతో నిర్వహించి పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి –సాంప్రదాయాలను నేటి తరం విద్యార్థులు మర్చిపోకుండా ఉండేందుకు పండుగల ప్రాధాన్యతను తెలియజేస్తున్నామని అన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, హరిదాసు వేషధారణ, సోధమ్మ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనంత రెడ్డి , ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు , ఉపాధ్యాయులు ఉషారాణి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులూపాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఎమ్ పి ఎల్-9 గ్రామ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**జనోదయ, మేడిపల్లి, జనవరి 13**



మేడిపల్లి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎమ్ పి ఆల్–9 గ్రామ క్రికెట్ టోర్నమెంట్ను వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మి నరసింహారావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మైదానంలో స్వయంగా టాస్ వేసి టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ఉత్సాహం పెరుగుతాయని, గ్రామాల్లో ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి సర్పంచి మకిలి దాసు, మేడిపల్లి బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు దేశవేని కృష్ణ, ఉప సర్పంచి తోపారపు అర్జున్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు మోతె చారిబాబు, గాడిపెల్లి బాబు, పంచారి రాజశేఖర్, మేకలా రంజిత్, దోజ్ రాకేష్, కేతావేణి రాజేష్, తునికి రాజు, భూమల్ల మల్లేష్ తదితరులు హాజరయ్యారు.కోఆప్షన్ సభ్యులు నీలం నవీన్, ఆర్మూరి హరీష్, ఎమ్.డి. అన్వర్ పాల్గొన్నారు.టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలను ఎమ్.డి. మోబీన్, నాగరాజ్, రామస్వామి, ఎమ్.డి. సాజిత్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ క్రికెట్ టోర్నమెంట్‌తో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నిర్వాహక బృందాన్ని స్థానిక ప్రజలు అభినందించారు.

# ప్రమాదాలకు చెక్ పెట్టే దిశగా 'అరైవ్ అలైవ్'






**పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ**

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి**

రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ, రవాణా శాఖ, ఆరోగ్య శాఖలు కలిసి 'అరైవ్ అలైవ్-2026' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పది రోజులపాటు విస్తృత రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలను చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలో కీలక ప్రాంతమైన జెండా చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో పెద్దపల్లి సహాయ పోలీసు కమిషనర్ గజ్జి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి వాహనదారుడి పాత్ర అత్యంత కీలకమని అన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు వాడకం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వేగ నియంత్రణ వంటి అంశాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అతివేగం, నిర్లక్ష్యం ఒక్క క్షణంలో కుటుంబాల జీవితాలనే మార్చేస్తాయని హెచ్చరించారు. పెద్దపల్లి ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడూ దానిలో భాగస్వామి కావాల్సిందేనని తెలిపారు. చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందన్న సత్యాన్ని ప్రతి వాహనదారుడు గుర్తుంచుకోవాలని సూచించారు.రవాణా శాఖ తరఫున మాట్లాడిన పెద్దపల్లి ప్రాంతీయ రవాణా అధికారి, వాహనాలకు నమోదు, డ్రైవింగ్ లైసెన్స్, క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్షలు ఎంతో అవసరమని వివరించారు. నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు.ఈ అవగాహన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు పాల్గొని రోడ్డు భద్రతపై ముఖ్యమైన సూచనలు తెలుసుకున్నారు. ప్రజల్లో జాగృతి పెంచే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. రోడ్డు మీద ఒక్కరి జాగ్రత్తో ఎన్నో ప్రాణాలకు రక్షణగా మారుతుందన్న సందేశం ఈ కార్యక్రమం ద్వారా బలంగా ప్రజల్లోకి వెళ్లింది.

# నాలుగు నెలలుగా జీతాలు లేవు

**ఎన్‌హెచ్‌ఎం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన**

**జనవరి 22న కోఠీలో ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా హెచ్చరిక**

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి జిల్లా ఆరోగ్య శాఖలో పని చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలు హద్దులు దాటుతున్నాయి. గత నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ జీవితం తలకిందులైందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇళ్ల అద్దెలు, పిల్లల చదువులు, రోజువారీ ఖర్చులు, వైద్య అవసరాలు ఏదీ సకాలంలో తీర్చలేని దుస్థితిలోకి తాము నెట్టబడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సేవలే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నా, తమకు మాత్రం కనీస ఆర్థిక భద్రత లేకుండా పోయిందని వారు అంటున్నారు. సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన పరిష్కారం దక్కలేదని ఉద్యోగులు పేర్కొన్నారు.ఈ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 22న హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ఉద్యోగులు హెచ్చరించారు. తమకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నోటీసులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉమాదేవి, ప్రదీప్, మహేందర్, నరేష్, అనిల్, ప్రభాకర్, వైభవ్, అఖిల, సునీత, సుష్మ, సరళ తదితరులు పాల్గొని తమ గోడును వినిపించారు. "ఆరోగ్య శాఖకు మేమే వెన్నెముక. అయినా మా కష్టాలను పట్టించుకోకపోవడం బాధాకరం" అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి జీతాలను విడుదల చేసి న్యాయం చేయకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# మేడిపల్లిలో అరైవ్ అలైవ్




**జనోదయ, మేడిపల్లి, జనవరి 13**

మేడిపల్లి మండల కేంద్రంలోడిజిపి శివధర్ రెడ్డి ఆదేశాలనుసారం,జిల్లా ఎస్పి అశోక్ కుమార్ సూచన మేరకు "అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఈ నెల 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు చేపట్టనుంది.కార్యక్రమంలో మేడిపల్లి ఎంపీడీవో అంజుమ్ పాల్గొని, రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించవలసిన అవసరం గురించి ప్రజలకు అవగా హన కల్పించారు. ఎస్సై మేడిపల్లి మాట్లాడుతూ, యువత తాగి వాహన నడపడం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ ఉపయోగించి డ్రైవింగ్ చేయడం వంటి తప్పుల నుండి దూరంగా ఉం డాలన్నారు.ప్రజలందరినీ రోడ్డు భద్రత నియమాలు పాటిం చాలని విజ్ఞప్తి చేశారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# ట్రాఫిక్ నియమాలపై ముస్త్యాలలో అవగాహన

**గోదావరిఖని టూటౌన్ సిఐ ప్రసాద్ రావు**

**జనోదయ, గోదావరిఖని,** పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా "అరైవ్ -అలైవ్ కార్యక్రమం లో భాగంగా భవిష్యత్తులో రోడ్డు ప్రమాద రహిత సమాజం, ప్రమాదాలలో మరణాలు నియంత్రణ లక్ష్యంతో టూ టౌన్ సిఐ ప్రసాద్ రావు ఆదేశాల మేరకు టూ టౌన్ కానిస్టేబుల్ పూర్ణ చందర్, ప్రదీప్ రెడ్డి, రహదారి భద్రత, న్యాయపరమైన అంశాలు, ట్రాఫిక్ నియమాలపై సదస్సు, నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కానిస్టేబుల్ మాట్లాడుతూ ఎక్కువ మంది యువకులు యుద్దాల సమయంలో కన్నా నిత్యం మైనర్, ర్యాష్, త్రిబుల్ రైడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువ మంది మరణించడం జరుగుతుంది అన్నారు. ఈ సం దర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో .ట్రాఫిక్ నియమాల పాటించడం వల్ల ప్రమాదాలను ఎలా నివారించవచ్చో, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాధాన్యత, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలు, మైనర్లు వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలపై గ్రామస్తులకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## రిపబ్లిక్ డే సమ్మక్క జాతరలను
# ఘనంగా నిర్వహించాలి

**సింగరేణి ఏరియా జిఎం రాధాకృష్ణ**



**జనోదయ, మందమర్రి జనవరి 13**

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలను సమ్మక్క సారలమ్మ జాతరలను ఘనంగా నిర్వహించి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి ఏరి యా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ కోరారు. జిఎం కార్యాలయంలో మంగళవారం రిపబ్లిక్ డే, సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఏరియా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కోరారు. అదే విధంగా ఈ నెల 28 నుండి 31వరకు ఆర్కే 1ఎ సమీపంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు కావల సిన ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. జాతరకు విచ్చేయు భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలన్నారు. ఈ సంద ర్భంగా సంబంధిత ఉన్నతాధికారులకు జాతరకు సంబంధించి సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి ఎల్ ప్రసాద్, కేకే ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఎస్కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ డివై జిఎం ఈఅండ్ఎం బాలాజీ భగవతి ఝ, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పిఓ సత్యనారాయణ, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ రాము, డీజీఎం ఈ అండ్ఎం ఏరియా వర్క్ షాప్ దూప్ సింగ్, డివైపిఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సందీప్, ఏరియా సర్వే ఆఫీసర్ దేశాయ్, డివై మేనేజర్ ఐటి రవి, పలు డిపార్ట్మెంట్ల అధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## సర్వారెడ్డి పల్లిలో వినూత్న ముగ్గుల పోటీలు



**గంగాధర, జనోదయ జనవరి 13 :**

సంక్రాంతి పండుగ సందర్భంగా సర్వారెడ్డి పల్లి గ్రామంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 4వ వార్డు సభ్యులుగా చిలిముల సతీష్, 5వ వార్డు సభ్యులుగా దుబ్బాసి పద్మ-కనకయ్య గెలుపు సాధించిన సందర్భంగా గ్రామస్తులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో 'ఆపరేషన్ సింధూరం' థీమ్‌తో మహిళా సైనికురాలిని ప్రతిబింబించే ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా సాధికారత, దేశ రక్షణలో మహిళల పాత్రను చాటేలా రూపొందించిన ఈ ముగ్గు అందరినీ ఆకట్టుకుంది. వినూత్న ఆలోచనతో ముగ్గు రూపొందించిన మహిళను సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ప్రత్యేక బహుమతితో సత్కరించారు. మహిళలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీ శాఖ పరిధిలో సోమవారం రాత్రి పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానిక అటవీ శాఖ అధికారి గులాం మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దమ్మయ పేట గ్రామానికి చెందిన అరుగురు వ్యక్తులు కొడిమ్యాల రేంజ్ పరిధిలోని దమ్మయ్యపేట, నాకలమర్రి, ఫాజులు నగర్ గ్రామాల అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికి నాలుగు ఎడ్ల బండ్లపై కలపను తీసుకొని వేములవాడ వైపు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వారిని వెంబడించారు. వేముల వాడ మండలం నమ్మిన గుండ్లపల్లి గ్రామం శివారులో అటవీ శాఖ సిబ్బంది గమనించి ఎడ్లను తీసుకొని కలపను అక్కడే వదిలి పారిపోయినట్లు వారు తెలిపారు. అక్కడి నుండి బండ్లతో సహా 76 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. పారిపోయిన వ్యక్తులను గుర్తిం చామని త్వరలోనే వారిని పట్టుకుని చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఇక్కడ డిప్యూటీ రేంజర్ ముషీర్, మౌని క, బీట్ ఆఫీసర్ అశ్విని, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.



## ముగ్గుల రంగులకు భలే గిరాకీ



**జనోదయ,బెల్లంపల్లి, జనవరి 13:**

సంక్రాంతి పండుగ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో ముగ్గుల రంగులకు గిరాకి పెరిగింది. వివిధ రంగులను కొనుగోలు చేసేందుకు మహిళలు మంగళవారం పోటీ పడడం కనిపించింది. పట్టణంలోని మెయిన్ బజార్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో రంగుల విక్రయాలు జోరుగా సాగాయి. రాత్రి వరకు ముగ్గుల రంగులు కొనుగోలులో మహిళలు మునిగి పోయారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 .... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

జనోదయ – గంగాధర | జనవరి 13:

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచి తన గొప్ప మనసును చాటుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.

గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గరిగంటి కరుణాకర్ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటనపై ఇప్పటికే కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం కరుణాకర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, తన స్వంత నిధుల నుంచి రూ.3 లక్షలు, ప్రభుత్వం తరపున రూ.1 లక్ష మొత్తంగా రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి కష్టాలు వచ్చినా పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా పెద్దన్నలా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

కరుణాకర్ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చొప్పదండి నియోజకవర్గ ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో అంబటి రజిత, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, పుల్కం నర్సయ్య, సర్పంచ్ ఘోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, స్థానిక సర్పంచ్ దానే ఒదేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సాగి అజయ్ రావు, అట్లా శేఖర్ రెడ్డి, పడాల రాజన్న, ఈటవెణి శ్రీనివాస్, వేముల భాస్కర్, గునుకొండ బాబు, బుర్గు గంగన్న, అట్లా రాజిరెడ్డి, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక దందా ఆరోపణలపై ఎస్సైపై చర్యలు: ఎమ్మెల్యే సూచనలకు వెనక్కి తగ్గని కరీంనగర్ సీపీ

*ఎస్సైపై వేటు నిలిపివేయాలని ఎమ్మెల్యే హుకుం..!!

*వెనక్కి తగ్గని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం..

*ముందు ఎస్సైని వీఆర్ చేస్తూ ఉత్తర్వులు

*పొలిటికల్ పైరవీ తర్వాత..సస్పెన్షన్ వేటు

*ఇసుక దందాలో వసూళ్లు చేస్తున్నట్లుగా ఎస్సైపై సీపీకి ఫిర్యాదులు

*డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ తర్వాత చర్యలు

*సీపీని తప్పబడుతూ.. డీజీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే

*ప్రొసిజర్ ఫాలోయినట్లుగా ఉన్నతాధికారులకు వివరణ

*సీపీకే సపోర్ట్ చేసిన ఉన్నతాధికారులు..

*వ్యక్తిగత పనులపై సెలవులో సీపీ... రాజకీయ ఒత్తిళ్లతో సెలవు పెట్టుకున్నట్లుగా పుకార్లు



జనోదయ, కరీంనగర్ ,జనవరి 13:

అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఓ ఎస్సైని కరీంనగర్ సీపీ సస్పెన్షన్ చేయడం ఇప్పుడు అధికారపార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోతున్నాడంట. అధికారానంత కవ్వంపెట్టి సీపీ చిలికేశాడన్నట్లుగా సదరు ఎమ్మెల్యే వ్యవహారం ఉన్నట్లుగా తెలుస్తోంది. లోయర్ ట్యాంకడ్ బండ్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌పై పోలీస్ కమిషనర్‌కు స్వయంగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టారు. విచారణలో స్పష్టమైన ఆధారాలు లభించడంతో ఈ మేరకు సదరు ఎస్సైని ముందుగా కమిషనరేట్‌లో రిజర్వుడ్ చేశారు. అయితే ఈ విషయంలో తనకు తెలియకుండా ఎస్సైపై చర్యలు తీసుకోకవడమేంటి...? అంటూ సదరు ఎమ్మెల్యే సీపీతో పరోక్షంగా వైరం మొదలుపెట్టాడన్న చర్చ ఇప్పుడు పోలీసు వర్గాల్లో జరుగుతోంది. అంతేకాదు...వెంటనే సదరు ఎస్సైని సేమ్‌పోస్టుకు పంపాలని హుకుంకూడా జారీ చేసినట్లుగా తెలిసింది. ఈ విషయంలో సీపీపై డీజీపీకి సైతం ఫిర్యాదు చేసినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. అయితే అదేసమయంలో ఎస్సైపై వచ్చిన ఫిర్యాదులు, అధికారులకు సమర్పించిన నివేదికలు.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లుగా సీపీ సైతం ఉన్నతాధికారులకు వివరించినట్లు సమాచారం.

# ఆపరేషన్ స్మైల్ లో భాగంగా 45 మంది బాలల ప్రొటెక్షన్ : అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ

జనోదయ, కరీంనగర్ ,జనవరి 13:

కరీంనగర్ మొదటి పరిధి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, జిల్లాలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ఈ ఏడాది జనవరి 2026 నుంచి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా మిస్సింగ్ చిల్డ్రన్, బాల కార్మికులు, స్కూల్ డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి రక్షించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ లైన్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గంగాధర మండలంలో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో చాట్ పొయ్యి వద్ద గ్యాస్ స్టవ్ దగ్గర పనిచేస్తున్న 14 ఏళ్ల బాలుడిని గుర్తించి రక్షించామని తెలిపారు. బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు.

ఇదే మండలంలో గతంలోనూ ఒక నిర్మాణ ప్రదేశంలో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడిని గుర్తించి యజమానిపై కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు.

చైల్డ్ అండ్ అడోలసెంట్ లేబర్ యాక్ట్ ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ పనిలోనూ పెట్టడం నేరం అని, అలాగే 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో నియమించరాదని స్పష్టం చేశారు. ఈ చట్టం ప్రకారం యజమానులకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా, అలాగే ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశముందని తెలిపారు. అలాగే రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం 14 సంవత్సరాల లోపు ప్రతి




బాలుడు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాల్సిందేనని, స్కూల్ టైమ్‌లో పనికి పంపడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కుటుంబ వ్యాపారాల్లో కూడా స్కూల్ సమయం కాకుండా, ప్రమాదకరం కాని పనులకే పరిమితంగా మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం మూడు ఆపరేషన్ స్మైల్ టీమ్‌లు పనిచేస్తున్నాయని, హుజురాబాద్‌లో ఒకటి, కరీంనగర్ రూరల్‌లో ఒకటి, కరీంనగర్ అర్బన్‌లో ఒక టీమ్ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 45 మంది పిల్లలను వివిధ పరిస్థితుల్లో రక్షించామని, వీరిలో కొందరు చైల్డ్ బెగ్గింగ్‌లో ఉన్న పిల్లలు, మిస్సింగ్ మరియు డ్రాప్‌అవుట్ పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపారు. ఎక్కడైనా బాలకార్మికులు, మిస్సింగ్ చిల్డ్రన్ లేదా చైల్డ్ మ్యారేజ్ కేసులు కనిపిస్తే ప్రజలు వెంటనే 1098 చైల్డ్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందిన వెంటనే సంబంధిత బృందాలు అక్కడికి చేరుకుని పిల్లలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తాయని మహమ్మద్ రఫీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో చైల్డ్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, కొత్తపల్లి ఎస్సై చిన నాయక్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, చైల్డ్ లేబర్ మెంబర్ సాయి కిరణ్, మహిళా కానిస్టేబుల్ గౌతమి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# కోట్ల ఖర్చుతో నిర్మించినా నిరుపయోగంగా సమీకృత వెజ్–నాన్‌వెజ్ మార్కెట్



జనోదయ – జగిత్యాల | జనవరి 13:

జగిత్యాల పట్టణం బీటుబజార్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. 2021-22 సంవత్సరంలో రూ.6.50 కోట్ల నిధులతో ప్రారంభమైన నిర్మాణ పనులు దాదాపు ఏడాదిన్నర క్రితమే పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు మార్కెట్‌ను ప్రారంభించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

ఈ సమీకృత మార్కెట్‌లో మూడు భారీ షెడ్లు, ఫ్లోరింగ్ సదుపాయాలతో మొత్తం 100 దుకాణాల నిర్వహణకు వసతులు కల్పించారు. ఇందులో పూలు, పండ్లు, కూరగాయల విక్రయాలకు 60 దుకాణాలు, మటన్, చికెన్, చేపలు, కోడిగుడ్లు తదితర నాన్‌వెజ్ విక్రయాలకు 40 దుకాణాలు కేటాయించారు. వ్యాపారులకు అనుగుణంగా షెడ్లలో గద్దెలు కూడా నిర్మించారు.

అయితే మార్కెట్ యార్డు వైపు ప్రహరీ, గేటు, పార్కింగ్ స్థలం హద్దులు వంటి కొన్ని మిగులు పనులు పూర్తి చేయకపోవడంతో మార్కెట్ ప్రారంభం ఆలస్యం అవుతోంది. అదేవిధంగా వెజ్, నాన్‌వెజ్ వ్యాపారులకు స్థలాల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోందని తెలుస్తోంది. ఈ అంశంపై అధికారులు పలుమార్లు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించినప్పటికీ తుది నిర్ణయం వెలువడలేదు.

సమీకృత మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో పట్టణవ్యాప్తంగా రహదారుల వెంట కూరగాయలు, నాన్‌వెజ్ విక్రయాలు పెరిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం విద్యానగర్ రైతుబజార్, అంగడిబజార్, టవర్ ప్రాంతాల్లో కూరగాయల మార్కెట్లు ఉండగా, కొత్త బస్టాండ్, అన్నపూర్ణ చౌరస్తా, టవర్ ప్రాంతాల్లో చేపలు, మటన్ మార్కెట్లు కొనసాగుతున్నాయి.

ఈ మార్కెట్లలోని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులను సమీకృత మార్కెట్‌కు తరలిస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పాత బస్టాండ్, శ్రీరామ థియేటర్, అంగడి బజార్, అన్నపూర్ణ, నటరాజ్ చౌరస్తా వంటి ప్రధాన రహదారుల వెంట సాగుతున్న వ్యాపారాలను కూడా సమీకృత మార్కెట్‌కు మార్చాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

సమీకృత మార్కెట్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే ఒకే చోట కూరగాయలు, పండ్లు, పూలు, మాంసాహారం లభించడం వల్ల వినియోగదారులకు కూడా సౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రజాప్రతినిధులు, వ్యాపారులతో పలు మార్లు చర్చలు జరిపామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు సమీకృత మార్కెట్ ప్రారంభిస్తామని పురపాలక కమిషనర్ తెలిపారు.

# అమ్మా.. వస్తున్నా.. ఆ మాటలే ఆఖరు




జనోదయ, కరీంనగర్ ,జనవరి 14:

ఇంటికి వస్తున్నా అమ్మా.. అంటూ కుమారుడు ఫోన్ చేసి చెప్పిన మాటలే చివరివయ్యాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన కొడుకు మరుసటి రోజుకు కూడా రాకపోవడంతో ఆ తల్లి ఆందోళన చెందారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి.. వారం అవుతున్నా ఆచూకీ దొరకకపోవడంతో ఆ తల్లి కంటికి కునుకు లేదు. సరిగా భోజనం కూడా చేయలేదు. చివరకు కొడుకు వస్తున్న కారు బావిలో పడిందని తెలుసుకుని తల్లి గుండెలవిసెలా రోదించింది. కారు వెలికితీత ప్రారంభించినప్పటి నుంచి బావి పక్కనే కూర్చుని విలపిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది..



**మానకొండూర్ సీఐ సంజీవ్ కథనం మేరకు..**

మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన సంగం రాజు(32) హైదరాబాద్‌లోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నారు. ఈ నెల 3న రాత్రి స్నేహితుడి కారు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరి ఇంటికి వస్తున్నా అని తల్లి స్వరూపకు ఫోన్ చేసి చెప్పారు. కుమారుడు మరుసటి రోజు కూడా ఇంటికి రాకపోవడం ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఆమె ఈ నెల 5న మానకొండూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆయన చరవాణి సిగ్నల్‌తోపాటు కారు జీపీఆర్ఎస్ ఆధారంగా వేగురుపల్లి వద్ద వ్యవసాయ బావిలో పడినట్లు పోలీసులు సోమవారం గుర్తించారు. బావి రోడ్డు పక్కన ఉండటంతో వాహనం అదుపు తప్పి అందులో పడిందని భావించిన పోలీసులు మధ్యాహ్నం 3 గంటల నుంచి పొక్లెయిన్, క్రేన్ ద్వారా బావిలో గాలించగా కారు బంపర్ బయటకు వచ్చింది. దీంతో 45 అడుగుల లోతున్న బావి నుంచి నీటిని మోటార్లు పెట్టి తోడి అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో కారు, మృతదేహం బయటకు తీశారు. ఇంటికి వస్తున్నా అని ఫోన్ చేసిన కుమారుడు విగత జీవిగా మారడం చూసి అతని తల్లి, చెల్లి బోరున విలపించారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌ప్లాజాను 3వ తేదీ అర్ధరాత్రి 1.53 గంటలకు కారు దాటినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. కారు జీపీఆర్ఎస్ 4వ తేదీ తెల్లవారుజామున 2.53 గంటలకు ఆగిపోయింది. దీంతో ఆ సమయంలోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

**తండ్రి కూడా ఇలానే..**

ఊటూరుకు చెందిన స్వరూపకు కుమారుడు రాజుతోపాటు పెళ్లి కావాల్సిన కుమార్తె ఉంది. ఆమె భర్త ఏడాదిన్నర కిందట రాత్రి వేళ పొలాల మధ్య నుంచి నడుచుకుంటూ గ్రామానికి వెళ్తుండగా బావిలో పడి మృతి చెందారు. ఇప్పుడు కుమారుడు కూడా బావిలో పడి మృతి చెందడంతో ఆ తల్లి రోదిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది. కొడుకు ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆమె ప్రతి రోజూ ఠాణాకు వెళ్లి ఆరా తీశారు. గ్రామ సమీపంలోని బావిలో కారు పడిందని స్థానికుల ద్వారా తెలియడంతో సోమవారం మధ్యాహ్నం అక్కడికి వచ్చి ఏడుస్తూ కూర్చున్నారు.